# అదోరకం మనిషి

జంధ్యం వెంకటేష్‌బాబు

ఫ్యూన్ నరసింహం టేబుల్ దగ్గరకొచ్చి, అదేదో లంచం తాలూకూ వ్యవహారంలా చాలా మెల్లగా చెప్పాడు. ''రామకృష్ణసార్! మీకోసం ఎవరో వచ్చారు.''

రామకృష్ణ ఫైల్‌లోనుండి తలెత్తి చూస్తే నలభైఏళ్ళ ఓ వ్యక్తి కాసింత దూరంలో నిలబడి ఉన్నాడు. ఆ వ్యక్తితో తనకు అంతకు ముందెన్నడూ పరిచయం లేదు. కనీసం చూసిన జ్ఞాపకం కూడా రావడం లేదు. అందుకే ఆ వ్యక్తికేసి ప్రశ్నార్థకంగా చూస్తూ ''రండి! కూర్చోండి'' అన్నాడు అతడు.

ఆ వ్యక్తి రామకృష్ణ టేబుల్ దగ్గరగా వచ్చాక కుర్చీలో కూర్చో లేదు. ''ఐదు నిమిషాలు మీతో మాట్లాడాలి. అలా బయటకె ళ్దామా?'' అడిగాడు.

రామకృష్ణ మరింత ఆశ్చర్యపోయాడు. ఆ ఆశ్చర్యంతోనే ఆ వ్యక్తిని అనుసరించి బయటకు నడిచాడు.

ఇద్దరూ వరండాలో నిలబడ్డాక ఆ వ్యక్తి రామకృష్ణతో చెప్పాడు.

''నా పేరు బంగార్రాజు. ఇప్పుడు మీరు కొత్తగా అద్దెకు దిగాలనుకుంటున్న ఇంటిలో ఓ నెల క్రితం వరకూ నేను అద్దెకు వుండేవాడిని''.

రామకృష్ణకు ఆ వ్యక్తి ఎవరో అర్థమయింది. కాని ఆ వ్యక్తి ఎందుకొచ్చాడో మాత్రం అర్థం కాలేదు. అంతేకాదు, బంగార్రాజు తనకేసి సానుభూతిగా చూడడమూ అతడు గమనించాడు. ఆ చూపులు ఎలా ఉన్నాయంటే- సుడిగుండంలో పడి కొట్టుకుపోతున్న మనిషిని, ఈతరాక ఒడ్డున కూర్చుని చూస్తున్న మనిషి చూసినట్టు చాలా... చాలా జాలి కురిపిస్తున్నాయి.

'అయినా తనిప్పుడు సుడిగుండంలో పడి కొట్టుకుపోయే పరిస్థితిలో లేడే! మరి ఈ బంగార్రాజు అలా ఎందుకు చూస్తున్నాడబ్బా?!' రామకృష్ణకు జుట్టు పీక్కోవాలనిపించింది. అయితే తనది బాల్డ్‌హెడ్ కావడంతో ఆ అదృష్టం తనకు లేదని గుర్తుకొచ్చి ఆ ప్రయత్నం విరమించాడు.

అంతలో బంగార్రాజు చెప్పాడు. ''మీరు ఆ ఇంట్లో అద్దెకు దిగబోతున్నారని తెలిసి, మీరు కష్టాల పాలు కాకుండా ఉండాలన్న ఉద్దేశ్యంతో అతి కష్టంమీద మీ అడ్రస్ సంపాదించి ఇలా వచ్చాను.''

రామకృష్ణకు కొద్దిగా గుండె వేగం పెరిగింది. 'ఆ ఇంట్లో దిగితే తనకు కష్టాలా?!... అంటే కొంపదీసి ఆ ఇంట్లో దెయ్యాల్లో, భూతాలో ఉన్నాయేంటి?!...' అతడికి భయమూ కలిగింది.

బంగార్రాజు అతడి మనసులోని అనుమానం గమనించినట్టే చెప్పాడు.

''మీరూహించుకుంటున్నట్టు ఆ ఇంట్లో దెయ్యాలూ, భూతాలూ లేవు.''

రామకృష్ణకు భయం కొద్దిగా తగ్గాక అడిగాడు ''... మరి ఆ వీధిలో పెద్ద రౌడీ ఉన్నాడా?''

''అది చాలా మంచి లొకాలిటీ. అక్కడ రౌడీలు, గూండాలు వుండరు'' బంగార్రాజు ముఖం నిస్తేజంగా ఉంది.

ఇదేదో పెద్ద పజిల్‌లానే అనిపించింది రామకృష్ణకు. అతడు టివి క్విజ్‌లకు పెట్టాల్సినంత స్థాయిలో బుర్రపెట్టి ఆలోచించాడు.

'ఒక ఇంట్లో దెయ్యాలు, భూతాలు లేవు. ఆ వీధిలో రౌడీలు, గూండాలు లేరు. అలాంటి చోట ఓ ఇంట్లో అద్దెకు దిగితే కష్టాలు రావడమేంటి?...' అలా పది సెకనులు ఏకాగ్రతతో ఆలోచించాక అతడికి తోచింది.


''ఆ!... అర్థమయింది... అయితే ఇదే కరెక్ట్. ఆ హౌస్ ఓనర్ మంచి వాడు కాదు. చీటికిమాటికి ఇంటికొచ్చి ఏవేవో ఆంక్షలు పెట్టి విసిగిస్తుంటాడు... యామైరైట్''. పరిశోధన చేసి గొప్ప విషయం కని పెట్టిన శాస్త్రజ్ఞుడి ముఖంలో కదలాడినంత ఆనందం ఆ క్షణం రామకృష్ణ ముఖంలో కదలాడింది.

బంగార్రాజు ఎప్పటిలానే తల అడ్డంగా ఆడించాడు. ఆ తర్వాతే చెప్పాడు. ''ఆ ఇంటి ఓనర్ అద్దెకున్నవాళ్ళను ఇబ్బంది పెట్టేరకం కాదు. పైగా మనం అద్దె తీసుకెళ్ళి ఇచ్చినప్పుడే తీసుకునేంత సహృదయుడు''.

ఈసారి రామకృష్ణకు పిల్లిమొగ్గలేయాలనేంతగా పిచ్చి రేగింది. కాని తమాయించుకున్నాక వెంటనే ఓ నిర్ణయమూ తీసుకున్నాడు. 'బుర్రబద్దలు కొట్టుకునయినా ఈ పజిల్‌ని సాల్వ్ చేయవలసిందే.'

''యురేకా!... తెలిసిపోయింది.. ఆ ఇంట్లో ఎందుకు చేరకూడదో తెలిసిపోయింది... ఆ ఇంటి 'వాస్తు' బాగోలేదు... అంతే కదూ?''

బంగార్రాజు అతడినో అమాయకుడిని చూసినట్టుగా చూసి నవ్వాడు.



''ఆ ఇంటి వాస్తు బ్రహ్మాండం.''

'బుర్ర బద్దలు కొట్టుకున్నా అంతకన్నా ఎక్కువ ఆలోచించ లేనన్న విషయం పదిహేను సెకనుల తర్వాతే అర్థమయింది రామకృష్ణకు. అందుకే అతడు ఏడుపు లాంటి నవ్వుతో అడిగాడు. ''మరి... మరి అన్ని విధాలా బాగున్న ఆ ఇంట్లో నేను ఎందుకు అద్దెకు దిగకూడదో నా కర్థంకావడంలేదు.''

''ఎందుకంటే, మీరు చేరబోతున్న ఇంటి పక్క పోర్షన్‌లో అదో రకమైన మనిషి ఉన్నాడు కాబట్టి''.

''అదోరకమైన మనిషంటే?... కొంపదీసి ఆడాళ్ళకేసి అదోలా చూసి, ఏదోలా బుట్టలో పడేసే రకమా?'' రామకృష్ణ అనుమానంగా అడిగాడు.

''కాదు. పక్కింటి ఆడవాళ్ళను సొంత తోబుట్టువుల్లా చూసుకుంటాడు.''

''అయితే అప్పులతో వేధిస్తాడు...అంతేనా?''

''అప్పులతో వేధిస్తే ఏదోలా తప్పించుకోవచ్చు. అది కాదు సమస్య''.

రామకృష్ణకు బాగా విసుగేసిపోయింది. ''మరి అతడితో వచ్చిన సమస్య ఏంటయ్యా బాబూ?''

''పార్వతీశం అదోరకమైన మనిషి. అతడు అతి మంచోడే కాదు, ఏ తప్పూ చేయకుండానే, ఎదుటివాళ్ళు తనను అనుమానిస్తున్నారేమోనని బాధపడిపోతుంటాడు.

బంగార్రాజు ఏం చెప్తున్నాడో మొదట అర్థం కాలేదు. అర్థంకాగానే రామకృష్ణ అతడికేసి తినేసేలా చూసాడు. ''ఏంటయ్యా! నేను నీకంటికి మరీ అంత పిచ్చోడిలా కనిపిస్తున్నానా? ఎవరయినా ఇంటి పక్కన మంచోళ్ళు ఉండాలని కోరుకుంటారు. అందులోనూ అతి మంచోడు నా ఇంటి పక్కన ఉండటం నా అదృష్టం. అంతేకాదు. ఇతరుల తప్పులకు కూడా తనే బాధపడటం, మహనీయుల లక్షణం. ఆ పార్వతీశం ఎవరో నిజంగానే మహనీయుడు. అలాంటి మహనీయుడిని 'అదోరకమైన మనిషి' అనడానికి మీకెలా నోరొచ్చింది?...ఇక ఈ విషయంలో మీరు మరేం మాట్లాడకండి''

''మీ ఇష్టం'' అనేసి అతడికేసి జాలిగా చూసి వెళ్ళిపోయాడు బంగార్రాజు.

రెండు రోజుల తర్వాత రామకృష్ణ ఆ కొత్త ఇంట్లో అద్దెకు దిగాడు.

★★★

''నమస్కారం సార్... నా పేరు పార్వతీశం''

ఇంట్లో చేరిన మొదటిరోజే తన ఇంటికి వచ్చి పరిచయం చేసుకుంటున్న ఆ వ్యక్తికేసి రామకృష్ణ ఆప్యాయంగా చూసాడు. అయితే మనసు మూలల్లో ఏదో అనుమానం. సిక్త్‌సెన్స్ 'అతడు అదోరకమైన మనిషి... జాగ్రత్త... జాగ్రత్త!' అని చెపుతూనేఉంది.

''నమస్తే! కూర్చోండి'' చెప్పాడు రామకృష్ణ.

సరిగ్గా అదే సమయంలో లోపలనుండి అతడి భార్య శాంతి గొంతు వినిపించింది. ''ఏమండీ! ఒకసారి ఇలా వస్తారా?''

ఆ మాటలు వినిపబడడంతోనే పార్వతీశం ముఖంలో రంగులు మారిపోయాయి. ''అయ్యోయ్యో! మీ ఆవిడ మిమ్మల్ని పిలుస్తోంది. నేనొచ్చి అనవసరంగా మిమ్మల్ని ఇబ్బంది పెడ్తున్నట్టున్నాను... వెళ్ళండిసార్! ఇదేంటో నా ఖర్మ. నేనెవరికీ ఇబ్బంది పెట్టకూడదనే అనుకుంటాను. కాని ఎవరో ఒకరిని ఏదో రూపంలో ఇబ్బంది పెడుతూనే ఉంటాను... ప్లీజ్ సార్! మీరు లోపలికి వెళ్ళండి...'' అతడితో మొదటి పరిచయమే రామకృష్ణకు కళ్ళు తిరిగేలా చేసింది. 'ఒక వ్యక్తి ఇంటికొచ్చాడు. అంతలో ఇల్లుగల్లావిడ భర్తను పిలిచింది. ఈ మాత్రానికే వచ్చిన వ్యక్తి ఇంతగా ఫీలయిపోవడం అవసరమా?'

''ఫర్వాలేదు సార్! మీరు కూర్చోండి''

''వద్దుసార్! మీ ఆవిడ మిమ్మల్ని పిలిచిందంటే, నిజంగా ఏదో అవసరమై ఉంటుంది. అవసరపడి భార్య పిలిస్తే, భర్త వెళ్ళకపోతే ఏమంత బాగోదు కదా? దానివల్ల మీకు తర్వాత్తర్వాత ఇబ్బంది ఎదురు కావచ్చు... నేనే మరోసారి కనిపిస్తాలేండి'' పార్వతీశం వెళ్ళిపోయాడు. →

రామకృష్ణకు మనసులోని అనుమానం మరికాస్త బలప డింది. షాక్ నుండి తేరుకునేందుకు పావుగంట పట్టింది.

మర్నాడు మరో సంఘటన జరిగింది.

వాసంతి కళ్లు చెమ్మ చీపురు కనిపించక, ఇంటి ముందు వెతుకుతూ గొణుక్కుంటోంది.

అప్పుడే పార్వతీశం గేటు తీసుకుని లోపలికొచ్చాడు. ''ఏంటండీ! ఏదో వెతుక్కుంటున్నట్టున్నారు?'' అడిగాడు.

''చీపురు కనిపించటంలేదండీ''

'గుమ్మడికాయ దొంగలు' అనగానే అందరికన్నా 'అతి మంచోడే' అతిగా భుజాలు తడుముకుంటాడు.

పార్వతీశం ముఖంలో ఎప్పటిలాగే రంగులు మారాయి. 'మేడమ్! మీ ఇంటికి నేను... నేనిప్పుడే వస్తున్నాను. మీ చీపురు గురించి నాకు.. నాకయితే ఏమీ తెలియదు''.

అతడి కేరెక్టర్ అప్పటికింకా తెలియని వాసంతి అదేదో జోక్ అనుకుని చిన్నగా నవ్వి వూరుకుంది.

పార్వతీశం గొంతు వినబడడంతో రామకృష్ణ ఇంట్లో నుండి వరండాలోకొచ్చాడు.

వాసంతి నవ్వు చూసిన పార్వతీశం మరింత కంగారుపడిపో యాడు. ''మీ నవ్వు చూస్తుంటే, మీరు... మీరు నన్ను అను మానిస్తున్నట్టుగా ఉంది.''

ఈసారి కంగారుపడటం వాసంతి వంతయింది. ''ఛీ ఛీ! మిమ్మల్నెందుకు అనుమానిస్తానండీ! అయినా చీపురు తీసు కుని మీరేం చేసుకుంటారు?''

''మా ఇంట్లో వాడుకోవచ్చు కదండీ''

వాసంతి కాస్త ఇబ్బందిపడిపోతూనే చెప్పింది ''అయినా మీరు అలాంటి వారు కాదని మా వారు చెప్పారులెండి''

''మీ వారు చెప్పి వుండొచ్చు. కాని మీరు నమ్మాలని రూలేం వుందండి?.. ఇంతకుముందు ఈ ఇంట్లో వున్నావిడ నన్ను నమ్మేది కాదండి. వాళ్ళాయన మాత్రం నన్ను బాగా నమ్మే వాడు. అయితే ఒక రోజు వాళ్ళావిడ ఇంట్లో లేని సమయంలో ఆయన మరో ఆడదాన్ని ఇంటికి తీసుకొచ్చాడండి. అది చూసిన నేను ఆవిడ వచ్చాక 'చూడండి! ఎందుకనో మీరు నన్ను నమ్మినట్టు కనిపించటంలేదు. కాని నేను నిజంగా చాలా మంచి వాడినండి. నేను మంచివాడిని కాబట్టే నిన్న మీరు ఊళ్ళో లేని సమయంలో మీ వారు ఓ ఆడదాన్ని ఇంటికి తీసుకొచ్చారన్న విషయం మీకు చెప్పేస్తున్నాను. అదే నేను చెడ్డవాడినయి వుంటే, మీకీ విషయం చెప్పకుండా మీవారితో కలిసి ఎంజాయ్ చేసి వుండేవాడిని కదండీ?'' అని చెప్పానండి.

వాసంతి కనుబొమలు ముడివేసి అడిగింది ''ఆ తర్వాతే మయింది?''''ఏమయిందో తెలియదుగాని, ఆయన, ఆవిడ ఈ ఇల్లు విడిచి వేరు వేరు కాపురాలు పెట్టారని విన్నానండి.''

వింటున్న రామకృష్ణకు గొంతు తడారిపోయింది. 'ఇల్లాలు ఇంట్లో లేని సమయంలో మగాడు చేసే పనులు ఆ ఇల్లాలికి తెలిస్తే?!...ఇలాంటి అధోరకమైన మనిషివల్ల అలాంటి ప్రమాదం ఉందన్నమాట... అమ్మో! అప్పుడప్పుడు ఇంట్లో తెలియకుండా మందుకొట్టడం నాకు అలవాటు. నో...

రెండు రోజుల తర్వాత ఆ ఇంటి ముందు 'టులెట్' బోర్డు వేలాడుతోంది. ★

# చరిత్రకెక్కని మారణహోమం

***5 వ పేజీ తరువాయి***

ఈ కథ ''తగ వినిపించిన ధార్మికులకు నవ్యయానంద సంప్రాప్తి యావహిల్లు'' అని ఫలశ్రుతి.

కాబట్టి ఈ కథ విన్న మనకందరికీ ఇహలోకంలోనూ పరలో కంలోనూ అవ్యయానందం సంప్రాప్తిస్తుంది.

ఎప్పుడు?ఈ కథ చదవగానే మనమందరం తల పైకెత్తి ఆకాశంవైపు చూస్తూ రెండు చేతులూ జోడించి దండం పెట్టు కొని ''ఆహా ఆ విధవలందరూ ఎంతటి పవిత్రమూర్తులు. వ్యాసుడు ఎంతటి మహిమాన్వితుడు! పవిత్రమూర్తులైన విధవ లందరికీ దివ్య పదం ప్రసాదించి అందరినీ కృతార్థురాండ్రను చేశాడు'' అని మనం అనుకున్నప్పుడు.

కాని ఎందుకో అలా అనుకోవాలంటే మనసు అంగీకరించ డంలేదు. కోరిక కోరమంటే ధృతరాష్ట్రుడు చచ్చినవాళ్ళనందరినీ మళ్లీ చూడాలని కోరుకోవడమే వింత. ఒకవేళ కోరుకున్నాడే అనుకొండి- ప్రపంచంలో తమకంటూ ఏమీ మిగలనివారూ- అనునిత్యం పుత్ర శత నిధనజనిత వ్యథ అనుభవిస్తున్నవారూ, చాలా యేళ్ళ తర్వాత ఒక పగలు ఒక రాత్రి బ్రదికివచ్చిన కొడు కులతో తనివితీరా కాలక్షేపంచేసి సంయోగ వియోగాల అంతరం గుర్తించినవారూ అయిన గాంధారీ ధృతరాష్ట్రులు ఎందుకు తాము కూడా గంగానదిలో మునిగిపోకుండా నిలిచిపో యారు? ఇంకా ఏమి బావుకుందామని? ఆనాటి స్వర్గగమనం విధవలకు మాత్రమే పరిమితమా! కర్ణుని చావుతో మనస్సు వికల మైపోయి, బ్రదికియున్న ఐదుగురు కొడుకులనూ తన కొడు కులు కాదన్నట్లు తృణప్రాయంగా వదిలేసి అడవిలో బ్రదుకు తున్న కుంతి ఇంకా ఏమి అనుభవించాలని గంగలో దూక కుండా నిలిచిపోయింది? ఆనాటి స్వర్గ గమనం భారతయుద్ధ నిహతుల భార్యలకే పరిమితమా? భార్యలకు తప్ప మరెవరికీ ప్రేమాభిమానాలు వుండవా? ఆ భార్యలెప్పుడూ చావాలనే కోర్కె వెల్లడించలేదే! చనిపోయిన భర్తలను చూడాలనే కోరిక సైతం వాళ్ళలో ధృతరాష్ట్రుడు గాంధారి చెప్పేదాకా కలుగలేదే! ఒక్క క్షణం క్రితం భర్తలంతా వీడ్కోలు తీసుకొని గంగానదిలోకి తిరిగి వెళ్లిపోతుంటే ఒక్క విధవరాలు కూడా సహగమనం చేయాలను కోలేదే! ఇంతెందుకు యుద్ధభూమిలో ''కడునొవ్వుడు మేనులు వాడికై దువ్వుల్ కూరగనాటినం బుడమి కూలిన'' భర్తల పచ్చి కళేబరాలను చూచినప్పుడు కూడా ఎవరూ సహగమనం చేయా లనుకోలేదుకదా- ఇప్పుడు- ఇంతకాలం తర్వాత- ఇలాంటి తెగింపుకు, త్యాగానికి- విధవలైతే మాత్రం ఎట్లా పూనుకు న్నారు?

**కాదు ఇక్కడ ఏదో జరిగింది.**

**విధవలందరూ స్వచ్ఛందంగా గంగానదీ ప్రవేశం చేశా రంటే నమ్మశక్యం కావడంలేదు. వేరే కారణాలు ఏవో తప్పక వుండివుండాలి.**

తరుణ వయస్సులో విధవలైన వారి ప్రవర్తనలో ఏదో అవాం ఛనీయమైన మార్పు వచ్చి ధర్మరాజుకు తలనొప్పి కలిగించిం దనీ, వారందరూ ధర్మరాజుకు భారమయ్యారనీ, వారినందరినీ ఏదోవిధంగా తొలగించుకొంటేనే కాని తమ వంశ ప్రతిష్ఠ నిలువ దని ధర్మరాజు భావించాడనీ, ధర్మరాజు, వ్యాసుడూ, ధృతరా ష్ట్రుడూ- బహుశా- గాంధారి కూడా- కలిసి సమాలోచించి విధ వలందరినీ ఈ లోకంనుండి తప్పించేందుకు పన్నిన పథకం ఫలి తమే ఈ సామూహిక మారణహోమమనీ భావిస్తే తప్పా! పాపమా!!

''హరిహరీ! భరత వంశ సతీమణులను గురించి అంత మాట అనవచ్చునా కళ్లు పేలిపోగలవు'' అంటారా! అనండి. ఆ అనేదేదో మొదట అర్జునుడిని అనండి. ఎందుకంటే ఈ ఊహ మొట్టమొదట వచ్చింది అర్జునుడికే. ''స్త్రీషు దుష్టాసు వార్ష్ణేయ జాయతే వర్ణ సంకరః'' అని అర్జునుడు యుద్ధానికి ముందే చెప్పాడు. అర్జునుడు సామాన్యుడు కాడు. అనేక యుద్ధాలలో ఆరితేరినవాడు. యుద్ధాలవల్ల సమాజంలో సంభ వించే దుష్పరిణామాలు బాగా తెలిసిన అనుభవశాలి. అర్జు నుడు చెప్పినదంతా నిజమైపోయింది. విధవలు రాజ్యాధినేత ధర్మరాజుకు సమస్యగా తయారయ్యారు. ఈ పరిస్థితి ప్రేవులలో తీటలాంటిది. భరించడం కష్టం. గోక్కోవడానికి కుదరదు. వ్యాసుడు, ధర్మరాజు ఒక పథకం ఆలోచించారు. ఆ పథకానికి ధృతరాష్ట్రుడిని ఒప్పించారు.

లేకపోతే- ధర్మరాజుకు వృద్ధులను చూడాలని కోరిక కలుగ గానే నగరానికి ముగ్గుర్ని కాపలిపెట్టి చతురంగ బలాలతో ఆడా మగా, పిల్లామేకా అందరూ బయలుదేరడమేమిటి? ఎవరికి ఎప్పుడు కోరిక పుడితే వారు అప్పుడు వెళ్లి చూచి రావచ్చుకదా. అంత హంగామా ఎందుకు?

''అయితే ఇప్పుడేమంటావు'' అంటారా? ఏమంటాను! వేలసంఖ్యలో విధవలు సంఘాత బలవన్మరణం పాలైన ఒక దారుణమైన ఘట్టం చరిత్రలో మరుగున పడిపోయిందంటాను.

పురుషులు యుద్ధాలకు పోతే స్త్రీలు కోటగోడలపై నుండి మంటల్లో దూకి ప్రాణ త్యాగం చేయడం చరిత్రలో చూశాం. శత్రువులు క్రూరులై బలవంతులై తాము చావడం తథ్యం అని తెలిపోయినప్పుడు పురుషులు తమ అంతఃపుర స్త్రీలను తమ [illegible] యుద్ధరంగంలో దూకడం చరిత్రలో చాలాసార్లు చూశాం. అలా చాలాసార్లు జరిగినట్లు చరిత్రలో దాఖలాలున్నాయి. అది స్త్రీ పురుషులిద్దరికీ ఆత్మాభిమానానికి సంబంధించిన సమస్య. శత్రువుల చేతిలో ఎదురయ్యే పరాభవా నికో, హింసకో పరిష్కారమార్గం.

**కాని పురుషులు యుద్ధంలో మరణించిన తరువాత చాలా కాలానికి (పదహారు సంవత్సరాలని చెప్పబడింది) విధవలం దరూ సంఘాత బలవన్మారణహోమానికి గురికావడం ఒక్క భార తేతిహాసంలోనే కనబడుతూ వుంది.**

పరశురాముడు ధరణిగల రాజులనందరినీ ఇరవై ఒక్క సార్లు సంహరిస్తే వాళ్ళ విధవలు బ్రాహ్మణులవల్లా, ఋషుల వల్లా బిడ్డలను కని ఆ బిడ్డలను తమ రాజ్యాలకు వారసులుగా చేసుకొన్నారు. ఈ పద్ధతిలో సంతాన ప్రాప్తిపొందిన సందర్భాలు పూర్వ యుగాలలో అనేకం కనబడతాయి. పూర్వ యుగాలలో ఈ సంప్రదాయం నిరభ్యంతరంగా కొనసాగింది. దాన్ని ఆనాటి చరిత్రకారులు (పురాణకర్తలు) ఆమోదించారు.

అదే ద్వాపర యుగాంతం, కలియుగారంభం వచ్చేటప్ప టికి ఈ సంప్రదాయం నింద్యమైపోయింది. భరింపరానిద యింది. ''... దేవరాచ్చ సుతోత్పత్తిః కతా పంచ విసర్జయేత్'' అనే చట్టం తేబడింది. స్త్రీలకు ఆపాటి స్వాతంత్ర్యం, జీవించే హక్కు హరించుకుపోయాయి. స్త్రీల జీవితాలపై పురుషుల లోహపాద ఘట్టన మరింత పటిష్టమైపోయింది. ధర్మాలు అనే పేరుతో స్త్రీల బ్రతుకులకు హద్దులు నిర్ణయించే హక్కు పురు షుడు దొరకబుచ్చుకున్నాడు. ఆ హద్దుల్ని ఫలానా స్త్రీలు అతిక్ర మించారని నిర్ణయించే హక్కూ, వాళ్ళను తాత్కాలికంగానైనా శాశ్వతంగానైనా వదలించుకొనే హక్కు, అవసరమైతే- పనికిరాని వస్తువులను అవతలికి గిరవాటు వేసినట్లు- వాళ్ళను ఈ లోకం నుండి అవతలికి గిరవాటు వేసే హక్కూ పురుషుడు చేజిక్కించు కున్నాడు. పురుషులు నిర్దేశకులు, స్త్రీలు నిర్దేశ్యులూ అయ్యారు. సంఘంలో స్త్రీలు ద్వితీయ శ్రేణి పౌరులయ్యారు. భారత జాతి శరీరంలో సగభాగం చచ్చుబడిపోయింది. అప్పటినుండి భార తీయ సమాజం నిర్వీర్యం, ప్రగతి విహీనం అయిపోయింది.

ఈ ఘట్టం భారతేతిహాసంలో ఒక నల్లని పేజీగా మిగిలిపో యింది. ★